

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

***సీత...గజదొంగ***

ఇంతకీ కథ ఏమంటే.. స్కూలు పిల్లలు ఆశపడేది మాస్టర్లు వదిలేసిన చాక్‌పీసు ముక్కలకోసం కదా! అవి పోగు చెయ్యడంలో వున్న ఆనందం, లాభం, మీకు తెలుసుకదా! లాభం అంటే ఏమిటనా? అరంగుళం చాక్‌పీసుముక్కకీ మూడు 'చార్‌మినార్' డొక్కులు. అంగుళం రంగు చాక్‌పీసుకీ మూడు 'డెక్కన్' పెట్టెలు. అదే పసుపు రంగు చాక్‌పీసైతే రెండు 'విల్సు' పేకెట్లు. అదేకాక ఆ చాక్‌పీసు ముక్కల్తో గోడలమీద డ్రాయింగ్స్ గీసి మన 'ప్రతిభ'ని లోకానికి చాటవచ్చు. వాటితోనే మనలోని ఉక్రోషాన్నీ బాధనీ కూడా 'వాల్ రైటింగ్' వల్ల తీర్చుకోవచ్చు.

ఉదాహరణకి జోగ్గాడు ఓసారి రాఘవరావు గారి 'వాల్' మీద 'దడిగాడువానసిరా' అని రాసి, "ఒసే సీతా, దీన్ని కుడినించి ఎడమకి చదవ్వే!" అన్నాడు. భలేబావుంది. వెంటనే దానికిందే నేను, 'దడిగాహామడువాన్నమవదచ' అని రాశా. వాడ్నీ కుడి నించి ఎడమకి చదవమన్నా. వాడు అలాగే చదివి లబోదిబోమన్నాడు. ఇట్లాంటి సరదాలు బోలెడు చెయ్యొచ్చు చాక్‌పీసు ముక్కల్తో.

ఇహ కచ్చ తీర్చుకునే వాల్‌రైటింగ్స్ కొన్ని వుంటై. ఉదాహరణకి, "సమ్మిటారి గూడెం సుకుమారికి మహాటెక్కు - ఇట్లు ఆకాశరామన్న"

"శివాజీగాడు కాపీ కొట్టి లెక్కలో అరవై మార్కులు కొట్టేశాడు. నిజంగా వాడంత పప్పుసుద్ద సృష్టిలో లేడు - ఇట్లు ఆకాశవాణి. "

"జేబులో జీళ్ళు ఉంచుకుని కూడా పక్కవాడికి పెట్టకుండా తినేవాడు ఖచ్చితముగా నరకమున ప్రవేశించును. ఇది ముమ్మాటికీ సత్యమని గ్రహించవలెను - ఇట్లు దొండబోయిన దాకయ్య. "

"పిల్లలను అతిగా తిట్టే పెద్దలు, మరుజన్మలో హీనజన్మములెత్తెదరు" ఇలా వుంటై అన్నమాట. కొన్నైతే మరీ 'అతి'గా ఉంటై. అంటే 'కచ్చ' మరీ ఎక్కువైనప్పుడన్నమాట.

జరిగిందేమంటే ఓ రోజున మా 'పాకబడి' వాళ్ళకీ 'మేడబడి' వాళ్ళకీ ఆత్మగౌరవానికి సంబంధించిన యుద్ధం జరిగింది. మేడబడి స్కాలరు ఒకడు మా మద్ది మత్తైనగాడ్ని పట్టుకుని, "పోరా పాకనాయాలా!" అని ఇన్సల్టు చేశాడు.

వీడు వెంటనే "పోపోరా మెట్లులేని మేడబడి నాయాలా!" అని రిటార్టు ఇచ్చాట్ట. అంతే! వార్ మొదలైంది. అదీ సైలెంటువార్. మావాళ్ళు వచ్చేటప్పుడు వాళ్ళు కాళ్ళకి బ్రేక్ వేసి కిందపడేస్తే, వాళ్ళవాళ్ళు కబాడీ ఆడేప్పుడు వాళ్ళవీపుల మీద అచ్చులు పడేట్టు మావాళ్ళు చరిచారు. ఎవరు కంప్లైంటు చేసినా అందరికీ టెంకిజెల్లలు పడతైగనక ఇరుపక్షాల వాళ్ళం నిశ్శబ్ధ యుద్ధాన్నే సాగిస్తూ వచ్చాం.

సదరు యుద్ధం మొదలైన నాలుగోరోజున మా హిస్టరీ మాస్టారి పెన్ను పోయింది.

వెలక్కాయల విషయంలో నేను ఆల్‌రెడీ మా వూళ్ళో ఫేమస్ గనక, "మాస్టారూ! ఆ సీత పనే ఇది!" అని మేడబడి విద్యార్థిని కమలకుమారి అందరి ముందూ డిక్లేర్ చేసింది.

నా అదృష్టవశాత్తూ స్కూల్ బెల్ గణగనా మ్రోగుతుండటం వల్ల మా మాస్టారికి అది చెప్పిన మాట సరిగ్గా వినబడలేదు. కానీ, పక్కనే వున్న నాకెందుకు వినపడదూ? దాంతో నేను దెబ్బలాట పెట్టుకున్నా. తంతానని కూడా బెదిరించా.. ఆవేశంలో పుష్పకుమారీ జయలక్ష్మీ మేం బాహాబాహీ కొట్టుకోబోతుండగా విడదీశారు.

"రేపు చూస్తానే నీ పనీ!" అని అది తొడగొడితే,

"రేపటిదాకా ఎందుకే, ఇప్పుడే నిన్ను చీల్చి కాకులకీ గద్దలకీ వేస్తా!" అని నేను మహోద్రేకంగా అరిచా. ఈలోగా మా నాన్న రావటం గమనించి నేను అర్జంటుగా ఆయన దగ్గరికి పరిగెత్తా. మా నాన్నతో చెబుతానన్న భయంతో అది ఇంకా స్పీడుగా ఇంటికి పరిగెత్తింది.

మరుసటి రోజున పచారీ సరుకు తేవడానికి మా ఇల్లు టర్న్ తీసుకుని కుడివేపు తిరిగితే, ఎదురుగా పోస్టాఫీసు గోడమీద, "సీత అనబడే ఫస్టుఫారం ఏ సెక్షన్ రాక్షసి, పచ్చిదొంగ... మహాదొంగ..- ఇట్లు ఆకాశరామన్న" అని వుంది. జాగ్రత్తగా ఆ రాతని గమనించా. అది కమల రాత మాత్రం కాదు. దాని రాత కోడికెలికినట్టు వుంటుంది. ఏమైనా ఇది మేడబడి బేచ్ వాళ్ళదే అని నిర్ణయించుకుని ఈదర వారి సందు తిరిగా. అక్కడ రామ్మూర్తిగారి గోడమీద, "పాకబడి వాళ్ళంత పచ్చి దొంగలు లోకంలో వుండరు. వాళ్ళల్లో వున్న ఆడదొంగే మేస్టారి పెన్ను కొట్టేసిన వీరదొంగ! ఇట్లు సత్తుపల్లి స్వతకాయి" అని రాసుంది.

మా స్కూలు గోడల మీదా ఇలాంటి రాతలేట. ఆ విషయం మా ఇంటికి పాలుపోసే గొల్ల కిష్టయ్య చెప్పాడు. మా అమ్మ నా వంక అదోలా ఓ చూపు విసిరి, "ఇంకా నీకు పెడబుద్ధులు పోలేదుటే ముదనష్టపుదానా?" అంది.

"సరస్వత్తోడు. నాకేం తెలీదు!" అని మొత్తుకున్నా ఆవిడ నమ్మలా. గాలికి వర్షంతోడైనట్టు నేనంటే గిట్టని పెద్ద సీత నాయనమ్మ తగుదునా అని మా యింటికొచ్చి, "ఏమిటే సీతా.. గురువులంటే ఎవరనుకున్నావ్? గురువుగారి పెన్ను కొట్టేస్తావా! గురుస్సాక్షాత్ పరబ్రహ్మా అన్న శ్లోకం వినలేదుటే? నువ్వు చేసిన యీ వెధవపని వల్ల మీ అమ్మా నాన్నలకి ఎంత అప్రదిష్టే!" అని మా అమ్మకి మళ్ళీ పురెక్కించింది.

"కాదుమరీ" అంటూ మా అమ్మ నా చెవుల్ని బారెడు పొడుగు సాగదీసి, "మర్యాదగా ఆ పెన్నుని మాస్టారికి ఇవ్వు" అని వార్నింగ్ ఇచ్చింది. మా నాన్న అప్పుడు ఇంట్లో లేకపోవడం నా అదృష్టం.

ఏదయితే అదే అవుతుందనుకుని నడిచే స్కూలుకెళ్ళా. 'దొంగా పోలీస్ ఆడదామా' అని ఒకతి కావాలనే, నాకు వినబడేట్టు పక్కదానితో అంటే - 'దొంగరెడీ.. పోలీస్ నే వెతకాలి' అంటూ ఇంకోతి కోతిలా కిచకిచా నవ్వింది.

ఎంతకోపం వచ్చినా నేను మాట్లాడకుండా నా సీట్లో కూర్చున్నా. రెండో పీరియడ్ అయ్యేవరకూ ఇలాంటి ఎకసెక్కాలే.

మూడో పిరియడ్ మా హిస్టరీ మాస్టారిది. ఆయన వస్తూ రావడంతోనే, "పిల్లలూ, నా పెన్ను ఇంట్లోనే దొరికింది" అన్నారు.

ఆమాట వినగానే నేను లేచి, నాతో ఎకసెక్కాలాడిన వాళ్ళ వంక చూశా. వాళ్ళ తలలు వాలిపోయాయి. అవ్వాళ భోజనానికి మధ్యాహ్నం ఇంటికిపోలా. మా నాన్న బతిమాలినా రాను పొమ్మన్నా. ఆయనకి ఏమీ అర్ధంకాక, "ఆకలేస్తుందే సీతా.. ఆగలేవు." అని అన్నా నేను వినలా. (స్కూలుకి వచ్చే ముందరే మా అమ్మ అటక మీద దాచిన కజ్జికాయల్నీ, పెద్ద కారప్పుసనీ పేద్ద పొట్లం కట్టి కొట్టు కొచ్చానని ఆయనకి తెలీదుగా!)

సాయంత్రం ఇంటికెళ్ళగానే పూనకం వచ్చినదానిలాగా వూగుతూ, "ఏమే పెదపాడు మాలక్ష్మి కూతురా.! కన్నబిడ్డని దొంగా అనటానికి నీ నోరెట్టా వచ్చిందే? మాస్టారుగారు పెన్నుని ఇంట్లో మర్చిపోతే, దొంగతనం నాకు అంటగడతావుటే ప్లీడర్ సుబ్బారావు పెళ్ళామా? సొంతకూతురు అనికూడా చూడకుండా బారెడు సాగేట్టు నా చెవుల్ని ఎక్కదీస్తావుటే? ఇహ చచ్చినా నీ చేత్తో పచ్చిగంగనైనా ముట్టనే భాగ్యలక్ష్మీ, ఇవాల్టినించీ నువ్వు తల్లివీకాదు నేను కూతుర్నేకాదు!" అని భీకర ప్రతిజ్ఞ చేశా.

అంతటితో ఆగక పెద్ద సీత ఇంటి ముందు నిలబడి, వాళ్ళకి వినిపించేట్టు బిగ్గరగా, "ఏవండీ పత్తిత్తు ముసలమ్మగారూ, నేను దొంగనా? ఖబడ్దార్. ఇంకోసారి మా ఇంటికొచ్చి మా అమ్మకి పుర్రెక్కించావంటే నేనేం చేస్తానో నాకే తెలీదు. ఏమన్నా చైగల్ను. ఈ సీత మాటంటే మాటే. హరిహరాదులొచ్చినా సీత ఆగదు!" అని ఛాలెంజ్ విసిరా. పిరిగ్గొడ్డు. బైటికొస్తేగా.

మా నాన్న నన్ను బుజ్జగించి సైకిలెక్కించుకుని, బజారుకి తీసుకెళ్ళి, కొనకళ్ళ ముత్తయ్యగారి షాపులో 'వాటర్‌మేన్' పెన్ను కొనిచ్చాకగానీ నా కోపం తగ్గలా. మా అమ్మ చాలా బిడియంగా నాకు 'లంచం' సమర్పించుకుని ప్రసన్నం చేసుకుందనుకోండి..! అది వేరే విషయం.

ఆ విధంగా ఆ యొక్క మహాగణపతి దయవల్ల మాత్రమే నా మీద పడిన నీలాపనింద తొలిగిందని ఇప్పటికీ ఘంటాపథంగా చెప్పగలను. ఆ నీలాపనిందవల్లే, ఫస్టుఫాం 'ఏ' సెక్షన్‌లోని మొట్టమొదటి 'పెన్నుగత్తె'నయ్యా. (ఆ రోజుల్లో చిన్న స్కూల్లో పలకా బలపాలూ, హైస్కూళ్ళో పెన్సిలూ నోటుబుక్కులూ వాడించేవాళ్ళు. థర్డ్ ఫాం దాకా పెన్నూ గిన్నూ జాన్తానై.)

దసరాలు వస్తాయిగదా! దసరా వేషాలు పదిరోజులు వేస్తారుగదా! వాళ్ళ వెనకాల ఊరంతా తిరిగితే తప్పేంటి? ఒక్కోరోజు ఒక్కోవేషం. దుర్గాష్టమి రోజునైతే ఏకంగా కాళికామ్మవారి వేషం... ఎంత బాగుంటాయి? యీ పెద్ద వాళ్ళు ఎందుకు పిల్లల్ని దసరా రోజుల్లో రాచిరంపాన పెడతారూ? (అంటే అందరూ కాదనుకోండి.. మా అమ్మలాంటి వాళ్ళ గురించి నేనన్నది.)

ఏమాటకామాటే చెప్పుకోవాలి. గుడికీ ఆశ్రమానికీ అయితే మా అమ్మ ఎవర్రెడీ. వేషాల వాళ్ళ వెనక తిరిగితే మాత్రం నా పని గోవిందా. అయినా అమ్మల కళ్ళుగప్పటం ఎంతసేపూ! ఇంటికొచ్చాక ఎలాగూ తలంటి తప్పనప్పుడు 'భయమేలా ఓ మనసా?' ప్రతిరోజూ సాయంత్రం నాలుగింటికి ములుకుట్ల గోపాలకృష్ణశాస్త్రిగారి 'దేవీ భాగవతం' వినడానికి వెళ్ళితీరాల్సిందే అసలు ఆశ్రమంలోనూ శివాలయంలోనూ తెల్లవారుఝూమున నాలుగింటికే గోపూజలాంటి కార్యక్రమాలు మొదలౌతాయనుకోండి. కానీ పిల్లలకి కావాల్సింది కథలు. ఆ కథలు ఎలా చెప్పాలో తెలిసిన ఘనాపాఠి ములుకుట్లాయన. "రక్త బీజో మహాబాహో" అంటూ ఆయన సంస్కృత శ్లోకాలు చదివి ఆ తరవాత తెలుగులో రసవత్తరంగా చెబుతుంటే కలిగే మజానే వేరు. అదీగాక శివాలయంలో ప్రసాదాల కంటే ఆశ్రమ ప్రసాదాలూ మహా'దండి'గానూ, యమ రుచిగానూ వుండేవి. ప్రసాదం తింటే పూర్తి పూజచేసినంత ఫలమని పెద్దలు ఎప్పుడో చెప్పారుగదా!

ఒక్కొక్క రాక్షసుడ్ని అమ్మవారు 'హతం' చేసినప్పుడల్లా ఒక్కో కొబ్బరికాయకొట్టి హారతిచ్చే వాళ్ళు. ఇహ ములుకుట్లాయన చెప్పే కథలూ మధ్యలో చమక్కులూ ఎంత ఆకట్టుకునే వంటే, ఒక్క ఉపన్యాసం వదిల్తే ఒట్టు.

ఆ తరువాత మళ్ళీ పూజలు. ఆ తరువాత ఆరున్నరకి హరికథ. ఇంగువ వాసుదేవశాస్త్రిగారూ, ఇంత పొడుగున వుండే విశ్వనాథంగారూ హరికథ చెబుతుంటే ఆశ్రమం కిటకిటలాడిపోయేది.

ఇంగువవారి హరికథలో మధ్య 'కాఫీ దండకం' వుండేది. 'ఓ కాఫీదేవీ నమో కాఫీదేవీ' అంటూ ఆయన ఆదండకం అందుకోగానే జనాలు పగలబడి నవ్వుతూ ఆనందించేవారు.

ఇహ విశ్వనాథంగారు మహా నవ్వించేవాళ్ళు. "రాముడేమన్నాడే ఓ యమ్మల్లారా.," అనగానే మేమంతా "పూలు తెమ్మన్నాడే" అనరిచేవాళ్ళం అలాగే ఆయన 'సీత ఏమన్నాదే' అనంగానే మేవంతా "గాజులిమ్మన్నాదే, ఓ యక్కల్లారా బూందీ తెమ్మన్నాదే" అని మహోత్సాహంగా గొంతుకలిపేవాళ్ళం. నవ్వులే నవ్వులు. ఎవరన్నా మధ్యలో మాట్లాడుతూ ఇబ్బంది పెడితే ఆయన "ఒక బోడిగుండుకీ ఇంకోటి తోడూ - మాట్లాడుతున్నదీ, అటువైపు చూడూ!" అంటూ రాగయుక్తంగా పాటందుకోగానే మాటలు బంద్. విశ్వనాథంగారి ఇంటిపేరు నౌడూరివారు.

ఇక సత్యన్నారాయణ భాగవతార్ అయితే, "అక్కడ సీతమ్మవారు పూలుకోయుచుండగా ఇటువైపు నించి శ్రీరాములవారు-" అంటూ మొదలెట్టి "రఘురాముడూ - రమణీయ - వినీల-- ఘనశ్యాముడూ" అన్న ఘంటసాల వారి పాటని ఎత్తుకునేవారు. అచ్చు గ్రామ్‌ఫోను రికార్డులాగే. అప్పట్లో రేడియో లెక్కడివీ? ఉన్నా ఒకటో అరో! అవీ ధనవంతుల ఇళ్లల్లో మాత్రమే.

ఇక శమీపూజ రోజునైతే మరీ హడావిడి. ఓ జమ్మిచెట్టుని, అంటే పేద్దకొమ్మని తెచ్చి చక్కగా పాతిపెట్టేవాళ్ళు. మేమంతా కుటుంబ సభ్యుల పేర్లూ, స్నేహితుల, బంధువుల పేర్లూ కాయితాల మీద రాసి జమ్మి చెట్టు రెమ్మలకి లాఘువంగా తగిలించి, "శమీశమయతే పాపం, శమీశత్రు వినాశినీ, అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శినీ!" అనే శ్లోకం చదువుతూ ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణం చేసేవాళ్ళం. బస్.. అప్పటివరకూ చేసిన పాపాలన్నీ ఆ క్షణంతో మాయం. కొత్తపాపాల సంగతి తరవాత. ఏడాదికోసారి శమీపూజ రాక తప్పదుగదా!. మనం శ్లోకం చదువుతూ ప్రదక్షిణం చేసి పాపాల్ని తొలగించుకుంటాం గదా!

విజయదశమి రోజున 'మళ్ళీ' కుమారీ పూజలు జరిగేవి. సమత్తాడని కన్నెపిల్లలకి చక్కగా పారాణి పూసి పూజలు చేసి బోలెడన్ని ఫలహారాలూ పళ్ళు కానుకలూ ఇచ్చేవారు. ప్రతియేటా నేను రెడీ. ఎందుకంటే కానుకలతో బాటు అర్ధరూపాయో రూపాయో బహుశ్రద్ధతో భక్తితో మా చేతుల్లో పెట్టేవాళ్ళు.

"అది ఖర్చు చెయ్యకూడదే సీతా.! ఇలా ఇవ్వు నేను చక్కగా దాస్తా!" అని మా అమ్మ చాలా ప్రేమగా అనేది కానీ, ఆ బురిడీలు నాదగ్గరా.

"ఇవాళ నా పాదాలకి జనాలు పూజ చేశారు అంటే నేను సాక్షాత్తూ అమ్మవారిని. అమ్మవారికి ఇవ్వాలేగానీ, చేతిలోవి లాక్కోకూడదు. అలా అలాక్కుంటే మహాపాపం.. నరకం తప్పదు!" అని గంభీరంగా మొహం పెట్టి అనేదాన్ని. మా అమ్మ నోరు ఆ మాటతో బంద్.

దసరారోజుల్లో 'చలి' మహా 'ఇది'గా వుండేది. చలికాలం అంటేనే దుప్పటి, కుంపటి కదా! నా చేతులో పెట్టిన పవిత్రమైన దక్షిణ, గంటలో మిఠాయి నాగభూషణం వేడివేడిగా వేయించే పచ్చిమిరప బజ్జీలుగా మారి, నా పొట్టలో చేరేది. ఆ యొక్క బజ్జీలు తిన్నాక ఇంట్లో వంటలేం సయిస్తై.

"ఆకల్లేదు ఏమిటో!" అనేదాన్ని.

"అయ్యో అదేమిటీ?" అనేవాడు మానాన్న.

"నాగభూషణం కొట్లో మిర్చిబజ్జీలు మింగి వచ్చుంటుంది... ఏం ఫరవాలేదు. మీరు తినండి!" అని మా అమ్మ నావంక కొరకొరా చూసేది. ఇవాళ నేను 'కుమారి'ని గనక తిట్టటానికి లేదుగా.

"కావాలంటే నా చెయ్యి వాసన చూసుకో.! ఈ సీత జన్మలో అబద్ధం ఆడదుగాక ఆడదు!" గంభీరంగా అనేదాన్ని. అంతకుముందే చలం బావిదగ్గర మట్టితో రుద్దుకుని చేతులు కడుక్కున్నా గనక నాకేం భయం.

"ఆ చేతులూ మూతులూ వాసన చూసేది మీ వంశంవాళ్ళే. మా ఇంటావంటా ఆ ఛండాలపు బుద్ధులు లేవు!" అని మా అమ్మ నన్ను యీసడించేది. ఈసడింపులూ గీసడింపులూ మననేం చేస్తై.

దసరా గురించి మరో ముఖ్యవ్యవహారం చెప్పితీరాలి. అవేమిటంటే 'విల్లంబులు'. దసరా నెలన్నర ఉందనగానే మేదరి కేశవరావు వాళ్ళ నాన్న కణాతు బొంగుల్ని సన్నటి బద్దలుగా చీల్చి బాగా ఎండబెట్టి ప్రత్యేకంగా పేనిన తాళ్ళతో వాటిని 'విల్లు'ల్లాగా చేసేవాడు. ఇహ బాణాలు.. ఓ చివర మామూలుగా వుండి మరో చివర కాగితపు గుజ్జుతో చేసిన దిట్టమైన పొట్లాలు సన్నటి రాగి వైర్లతో గట్టిగా చుట్టేవాడు. ఇప్పుడా పొట్లంలో 'బుక్కా'రంగులు పోసి ఎవరిమీదకైనా బాణం సంధిస్తే, ఆ రంగులో వాళ్ళ బట్టలు ఖరాబయ్యేవి. ఓ విధంగా చెప్పాలంటే 'పిచ్‌కారీ'లాగా కాకుండా బాణంలో రంగుజల్లటం అన్నమాట.

మేస్టార్లు ఫలానారోజున ఫలానా వీధులు అని ముందుగానే మాకు చెప్పేవాళ్ళు. ఆరోజున రంగు కాయితాలు అంటించిన విల్లంబులూ, తలకి మేమే తయారు చేసుకున్న అట్టకిరీటాలతో కొత్త బట్టల్తో మాస్టారి వెంట బయల్దేరేవాళ్ళం. ప్రతి ఇంటిముందూ ఆగి మేం దసరా పాటలు పాడాలన్నమాట. ఇప్పుడు మా యింటికి వెళ్ళాం అనుకోండి... ముందుగా నేను వుండి పాటపాడాలి. "అయ్యవారికి చాలు అయిదువరహాలూ... పిల్లవాళ్ళకి చాలు పప్పుబెల్లాలు" అంటూ పాట ముగించగానే ఆ ఇంటి వాళ్ళొచ్చి మాకు ఏవో తినుబండారాలు, మాస్టారికి డబ్బులూ ఇస్తారన్నమాట.

మా ఇంటిముందరైతే నేను కాస్త 'హెచ్చుల'కి పోయి, "అదేంటి నాన్నా మాస్టారికి అయిదుగదా ఇవ్వమని చెప్పానూ" అనో, "అమ్మా.. కజ్జికాయలు కూడా చేశావుగా. అవి పెట్టలేదేం?" అనో అనేదాన్ని. మా అమ్మ మొహం 'ఇంత' చేసుకుని, "మర్చిపోయాన్లే!" అంటూ కజ్జికాయలు చచ్చినట్టు పంచేది. ఊరంతా 'కలెక్షన్లు' పూర్తయ్యాక ఇంటికొచ్చేదాన్ని.

అప్పుడు చూడాలి నా సామిరంగా, "అందరిముందూ నా పరువు తీస్తావుటే? కజ్జికాయలు మొత్తం ఊడ్పించేస్తావా?" అంటూ నా వీపు మీద 'దరువు' మొదలెట్టేది. మా నాన్న గభాల్న అడ్డొచ్చి, "చిన్నపిల్ల దానికేం తెలుసూ? చంపేస్తావాయేం?" అంటూ నన్ను రక్షించేవాడు.

"అది చిన్న పిల్లా? చిన్నపిల్లలాగే మాట్లాడిందా ఇందాకా?" అంటూ మా అమ్మ కజ్జికాయలన్నీ ఖర్చయిపోయినందుకు కోపంతో తెగ మటమటలాడేది.

దసరాలొస్తే మాస్టార్లకి ఆనందం. కొద్దోగొప్పో డబ్బులొస్తాయని. ఆ రోజుల్లో ఠంచనుగా జీతాలేవీ? పైగా ప్రయివేటు స్కూళ్ళు. 'బతకలేక బడిపంతులు' అనేవాళ్ళు.

దసరా అంటే ఆనందం.. దసరా అంటే కొత్తబట్టలు.. దసరా అంటే ఊరంతా ఉత్సాహంగా ఊగిపోయే పండగ.

## *క్వామేడ్ సీత.. ది లీడర్*

దసరా సెలవులు గడిచిపోయాక మళ్ళీ ఎదురుచూపులు.

దీపావళి వచ్చేవరకూ పిల్లకాయలందరూ బిజీ బిజీ.

"ఒసేయ్ సీతా.. మోపెడు జిల్లేడు మండలు మోసుకొచ్చి ఎండబెట్టేశానేవ్. ఇక నీదే ఆలస్యం.!" విజయదశమి అయిన మరుసటి రోజునే పార్వతీశంగాడు ఇన్ఫర్మేషన్ ఇచ్చేశాడు.

ఇప్పుడు మనం 'ధనం' సమకూర్చాలన్నమాట.

నిజంగా చెబితే మా బాచ్‌లోనే కాదు.. మా ఫస్టుఫాంలో కూడా నేనే 'రిచ్చి'. ఎందుకంటే, పిల్లల చేతికి పెద్దవాళ్ళు డబ్బులు అందనిచ్చేవాళ్ళు కాదు. కానీ ఇస్తే మహాగొప్ప.

'మన' విషయం వేరు. మా అమ్మ నివషానికోసారి బజారుకెళ్ళమంటుంది. అన్ని వస్తువులూ ఒకేసారి చెప్పదు. అందువల్ల స్కూలుకి వెళ్ళేలోపు కనీసం అయిదారుసార్లైనా కూరలకో ఉప్పు పప్పులకో పచారీ కొట్టుకి వెళ్ళి తీరాల్సిందే ఏ లాభమూ లేకుండా 'మనం' పనిచెయ్యంగా.

ఆ రోజుల్లో రూపాయికి పదహారు అణాలు. రెండు అణాలు = ఒక బేడా.. రెండు బేడలు = పావలా.. రెండు పావలాలూ = అర్ధరూపాయి రెండు అర్ధరూపాయలు =ఒక రూపాయి అనగా ఒన్ రుపీ.. ఏక్ రుపయ్యా.

ఏ కొట్టు దగ్గరైనా 'నగదు నేడు..అరువు రేపు' అనే ఓ చిన్న బోర్డుండేది. అంతేకాక ధర్మవడ్డీ రూపాయికీ ఒక అణా. అనికూడా చిన్న అక్షరాలతో రాసి వుండేది.

నేనూ అదే ఫాలో అయిపోయేదాన్ని..కాపోతే కొంచెం ధర్మ వడ్డీ పెంచి!

నాదృష్టిలో అణాకి 'కానీ' కొట్టెయ్యడం ధర్మమే. అదీగాక అన్నిసార్లు బజారుకీ ఇంటికీ తిరిగితే ఎంత శక్తి ఖర్చవుతుందీ? ఆ శక్తి కూడగొట్టు కోవాలంటే మిర్చి బజ్జీల్లాంటి బలిష్టమైన ఆహారం తినక తప్పదుకదా!

ఇలా 'కొట్టేసిన' డబ్బుల్ని మహా జాగ్రత్తగా దాచేదాన్ని.

అంతేగాక మా నాన్న మాంఛి మూడ్‌లో వున్నప్పుడు మస్కా కొట్టి కొంత, నా సొంత తెలివి తేటల్తో కొంత,'మనీ' లాగేసేదాన్ని.

"నీ డబ్బు నీ శక్తి".. "నీ డబ్బే నీ గౌరవకారణం".. "ధనమూల మిదం జగత్".. "పైసా మే పరమాత్మా"... "ధనవంతులు గౌరవింపబడెదరు.. ధనమును గౌరవించుము" లాంటి సూక్తుల్ని బాగా వల్లెవేసేదాన్ని మా అమ్మకి వినబడేట్టు.

మీరనుకోవచ్చు.. ఈ ఘనత వహించిన సీత ఉత్తి డబ్బు మనిషని. కానే కాదు. ముమ్మాటికీ కాదు.

మన చుట్టూ వుండే పాకబడి ఫ్రెండ్స్ సాదాసీదా వాళ్ళుకదా! వాళ్ళెంత ధనవంతులైనా 'మనకున్న' తెలివితేటలు వాళ్ళకి లేవుకదా! ధనం యొక్క 'శక్తి' వాళ్ళకి అర్థం కావాలంటే, ఆ శక్తి ఎటువంటిదో వాళ్ళకి ప్రాక్టికల్‌గా వివరించాలిగదా! చిత్తగించండి.

"ఇదో నాగభూషణంగారూ, ఓ అర్ధణా మిర్చిబజ్జీలు (2) ఓ అర్ధణాకి మిఠాయి (చిన్నపొట్లం) ఓ అర్ధణాకి మరమరాలవుండలు (3) పొట్లం కట్టి ఇవ్వండి!" అని స్టైలుగా ఓ అణన్నర ఆయన చేతిలో పెట్టి చుట్టూ చూసేదాన్ని. నా ఫ్రెండ్సు ఆబగా, ఆశ్చర్యంగా, ఒకించుక ఆరాధనతో మనని చూడటం ఎంత థ్రిల్‌గా వుంటుందీ?

మిగతా ముగ్గురికీ ఒకే బజ్జీని మూడు ఈక్వల్ తుంపులుగా చేసి, ఉదారంగా పంచి, ఒక బజ్జీని వేడివేడిగా హాయి హాయిగా తింటూవుంటే వచ్చే మజా లోకంలో ఎక్కడైనా మీరు నాకు చూపగలరా?

అలాగే కృష్ణయ్య ఇడ్లీ కొట్లో "ఇదిగో క్రిష్టయ్యా... అణా ఇడ్లీలు వేడివేడిగా వేసి ఇవ్వు. పచ్చడి ఎక్కువెయ్యకపోతే ఊరుకోను!" అని నేను గంభీరంగా అంటే, ఆ యొక్క క్రిష్ణయ్య, "అలగలాగేనమ్మా.. ఇదిగో!" అంటూ భక్తిగా బుద్ధిగా నాలుగు చిన్న ఇడ్లీలు, అవీ ఆవిరిగక్కుతున్నవి బాదం ఆకులో వేసి, దానిమీద 'ఇంత' శెనగ చెట్నీ పోసి ఇస్తుంటే, వచ్చే గౌరవం ఎంతటిదో మీరు ఊహించగలరా?

ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే, దీపావళికి ధనం సమకూర్చే అత్యంత క్లిష్టతరమైన బాధ్యతని మొయ్యాలంటే ఎంత 'ఇది'కావాలీ! అది పావలాతోనే అర్ధరూపాయితోనో అయ్యేపనికాదు. రూపాయలుండాలి.

వాటితో ఏం చేస్తామనేగా మీ ఆలోచన!

సూరేకారం, గంధకం, ఇంకా 'రజను' కొనాలి. కాయితాల్ని చిన్నచిన్న ముక్కలుగా.. కొలతలు పెట్టి మరీ చించి వాటిని బుల్లి బుల్లి గొట్టాలుగా తయారు చెయ్యాలి. దంటుపుల్లతో తయారు చేసే గొట్టాలు వేరు. అవి మతాబాలకి... చిన్నపొట్లాలు సిసింద్రీలకి.. చిన్నగొట్టాలు కారంపలుకులకి.. చిచ్చుబుడ్డికి తగిన చిచ్చుబుడ్డి పిడతలు కుమ్మరి సుబ్బారావు దగ్గర కొనక తప్పదుగదా! అలాగే చిచ్చుబుడ్డిలో మందు కూరేసాక క్రింద వేపు పట్టుండటానికి బంకమన్నో పుట్టమన్నో కావాలి కదా!

ఇవన్నీ రెడీ అయ్యాక అప్పుడు మొదలవుతుంది అసలు పని. జిల్లేడి మండల్ని కాల్చి బొగ్గు చెయ్యాలి. ఆ బొగ్గుని చితగ్గొట్టి పొడి చెయ్యాలి. ఆ పొడిని 'వస్త్ర కాయితం' పట్టాలి. ఆ వచ్చిన నున్నని బొగ్గిపొడితో పాళ్ళ ప్రకారం సూరేకారం గంధకం కలపాలి. ఆ మిశ్రమాన్ని మొదట సన్నని పొడవాటి సిసింద్రీ పొట్లాల్లో 'కూరి' వాటిని పరీక్షించాలి. అవి 'తుస్సు'మంటే సూరేకారం గంధకం పాళ్ళు పెంచడమో, మరో రోజు ఎండబెట్టి మళ్ళీ ఫైరింగ్ టెస్టు చెయ్యడమో చెయ్యాలి. ఇన్ని పనులు చెయ్యాలంటే ఎంత బుద్ధి కుశలతా ఓపికా కావాలో మీరే చెప్పండి.

శ్రీహరి కోట రాకెట్ పరీక్షల్లాగా ఎంత శ్రద్ధ తీసుకుంటే సిసింద్రీలు గగన విహారం చేస్తాయో!

అసలు సిసింద్రీల 'లెవెల్' నించి మతాబులూ, చిచ్చుబుడ్లు, 'అవ్వాయి చువ్వాయి'ల ఎత్తుకెదగాలంటే ఎంత మేధాశక్తిని ఖర్చుచెయ్యాలి?

ఇవి తయారు చెయ్యడం ఒక ఎత్తైతే, వాటిని జాగ్రత్తగా ఎవరి కళ్ళపడకుండా 'స్టోర్' చెయ్యడం ఎంత కష్టమో మీకెలాగు వివరించడం?

అంతేగాదు.. యీ టపాకాయల 'మేకింగ్' అంతా అతి జాగ్రత్తగా పెద్దల కళ్ళబడకుండా జరగాలి. తెలిసిందో.. అంతే సంగతి. వాళ్ళు నిర్దాక్షిణ్యంగా 'మందుగుండుని' ధ్వంసం చేసేస్తారు. అంతేకాక నిర్మొహమాటంగా చెవులు ఎక్కదీసి వీపులు చీరేస్తారు.

"కామ్రేడ్ పార్వతీశం" అని నేననగానే

"యస్ కామ్రేడ్ సీతా" అనివాడు ఎటెన్షన్‌లోకి వచ్చేవాడు.

"వస్త్రకాయితం పట్టావా?"

"యస్ కామ్రేడ్!"

"కామ్రేడ్!"

"మంచిది. సాయంకాలం మన కామ్రేడ్స్‌నందర్నీ పెద్ద చెరువు దగ్గరికి రమ్మని చెప్పు.! ఇవాళే మనం సిసింద్రీలు టెస్టు చైబోతున్నాం!" గంభీరంగా అనేదాన్ని.

అప్పట్లో రెండే పార్టీలు. కాంగ్రెసూ, కమ్యూనిస్టు. కమ్యూనిస్టులంటే చాలా నిజాయితీపరులని పేరు. కమ్యూనిస్టులు ఒకర్నొకరు ఒరేయ్ గిరేయ్ అయ్యా గియ్యా అనుకోకుండా 'కామ్రేడ్' అని పిలుచుకునేవారు. కామ్రేడ్ అంటే గ్రేటు అని చాలా గౌరవప్రదమైన సంబోధన అనీ మాకు తెలుసు. అందుకని మేము కామ్రేడ్ అంటే కామ్రేడ్ అని పిల్చుకునే వాళ్ళం. అందులోకీ 'డబ్బు' సమకూర్చేదాన్ని నేనే గనక అందరికన్నా పెద్ద 'కామ్రేడ్'ని నేనేగదా! ఇలా మేం ఒకళ్ళనొకళ్ళు కామ్రేడ్ అని పిల్చుకోవటం చూసిన మా వూరి కమ్యూనిస్టు లీడర్లు మహా ముచ్చటపడి, చదువుకోవటానికి 'సోవియట్ లాండూ' 'పీపుల్స్ చైనా'లాంటి అందమైన బొమ్మల పుస్తకాల్ని కూడా బహూకరించేవాళ్ళు. ఆ పదాలన్నీ మాకు బహుతెలిగ్గా పట్టుబడ్డాయి. ఉదా:రేఛల్ అనే అమ్మాయి ఎవరికీ పెట్టకుండా తనే పరిక్కాయల్ని బొక్కి తింటుంటే, కామ్రేడ్ పుష్పకుమారి కామ్రేడ్ జయలక్ష్మితో "చూడు కామ్రేడ్ జయలక్ష్మీ, యీ రేఛల్ మహా బూర్జువా! పక్కవాళ్ళకి పెట్టకుండా ఎలా తింటోందో చూడండి!" అనేది.

'కాదేదీ కవితకనర్హం' అన్నట్టు దీపావళికి కూడా బోలెడు సామాన్లు కావాలి.

'కాదేదీ దీపావళికనర్హం' అనుకుంటూ మేము ఖాళీ సీసా కాయల్ని సంపాయించేవాళ్ళం దాన్నో ఒక అవ్వాయి చువ్వాయిని పడేసి.. మూతికి మంటెట్టామా అంటే, అది నిప్పులు చిమ్ముకుంటూ ఆకాశంలోకి దూసుకుపోయేది. పి.ఎస్.ఎల్.వి ఎగిరి స్థిరకక్ష్యలో నిలిస్తే సైంటిస్టులు ఎంత సంబరపడతారో, మా అవ్వాయి చువ్వాయి నింగిలోకి దూసుకెళితే మేం అంత సంబరపడేవాళ్ళం.

దీపావళి నెలరోజుల ముందర్నించే యీ 'ఢామ్'...ఢమాల్'..'ఠాప్' 'తుస్స్'ల శబ్దంతో మా పెద్ద పుల్లేటికుర్రు లబడబలాడిపోయేది. గంధకం సువాసనతో ఊరంతా పరిమళించేది.

పెద్దవాళ్ళు 'తగిన' రీతిలో మమ్మల్ని సత్కరించేవారు. అది వేరే విషయం అనుకోండీ! ప్రమాదాలు జరుగుతై అని వాళ్ళ భయం.

'రిస్కు'తీసుకోకపోతే 'ముక్తి' ఎలా దక్కుతుందీ? ఇహ తాటాకు టపాకాయల్ని తయారుచెయ్యాలని ఎంత ప్రయత్నించినా మావల్ల కాలేదు సరికదా చేతులు కూడా కాల్చుకున్నాం.

మతాబులూ చిచ్చుబుడ్ల విషయంలో మా 'పాకబడి బేచ్' మిగతా అన్ని బేచీల్నీ చులాగ్గా అధిగమించి, అంతర్జాతీయఖ్యాతిని పొందినదని వేరే చెప్పక్కర్లేదుగదా!

దీపావళి అంటే స్వీట్లు. లడ్డూలు, కజ్జికాయలూ, అప్పాలూ, అరిసెలూ, జీడిపప్పు మిఠాయీ, స్వీట్ బూందీ, జిలేబీలూ, రవ్వలడ్డూలూ, పాయసాలూ, పాలతాలికలూ ఓహ్.. స్వర్గం నేలకి దిగిందా అన్న లెవెల్లో వుండేది. గవ్వలూ కొబ్బరి లౌజులూ లడ్లూ, సున్నివుండలూ, మరమరాల ఉండలూ, నువ్వుండలూ తేనె బొబ్బట్లూ, బొబ్బట్లూ పంచదార పూరీలూ... ఎక్కడికి పోయినా ఎవరింటికి పోయినా ఇవన్నీ పిల్లలకి పెట్టేవాళ్ళు. ఒళ్ళంతా ఆ రోజుల్లో స్వీటు కంపూ నేతి కంపూ కొట్టేది.

మా అమ్మ అయితే పదహారు చేతుల మహాదేవిలాగా స్వీట్లన్నీ యమఫాస్టుగా చేసి రేకు డబ్బాల నిండా కూరి అటకెక్కించేది. ఇహ బూరెల విషయంలో ఆవిడ స్పెషలిస్టు. మామూలు బూరెలూ, కొబ్బరిబూరెలూ ఇంకా ఏవో పుట్నాల బూరెలూ ఇలా రకరకాలు చేసేది.

కొంచెం పీనాసిది గనక నాకు మా నాన్నకీ మాత్రమే పొద్దున్నా సాయంత్రం ప్లేటులో వడ్డించేది సగానికి సగం కొట్టేసి ఆ తరవాత మా స్నేహితులకి నేను పంజారం చేసేదాన్ననుకోండీ..

లేకపోతే ఆ సీత, ఈ 'క్రామేడ్ సీత' 'పీనాసిదీ, బూర్జువా' అనిపించుకోవడం ఏం బాగుంటుందీ?

## *సీత శత్రువులు*

'తనకోపమె తన శత్రువు.. తన శాంతమె తనకు రక్ష' అన్న పద్యం నేను బట్టీపట్టిన మరుసటిరోజునే నా శత్రువులతో ఢీ కొట్టాల్సి రావడం నేను మర్చిపోలేను. దీపావళి మందుగుండు కోసం పార్వతీశంగాడు జిల్లేడి మండల్ని తెచ్చి ఎండబెట్టి బొగ్గు చేసిన మాట వాస్తవం. మధూగాడూ, మద్దిమత్తెనగాడూ, జోగారావూ సూరేకారం గంధకం బొగ్గుపొడీ వస్త్రకాయితం పట్టిన మాటా నిజమే. సిసింద్రీలకి పొట్లాలూ, మతాబులకి గొట్టాలూ చుట్టింది నేనేకదా? డొంకాడ వెంకట్రావుగాడు, కుమ్మరి సుబ్బారావు (అంటే కుమ్మరి నర్సింహులు కొడుకు) 'ఆము'కని తెచ్చిన బంకమన్ను - చిచ్చుబుడ్డి కుదుళ్ళకోసం కొట్టుకొచ్చినదీ వాస్తవమేకదా.

ఇవన్ని శారీరక శ్రమతో కూడుకున్నది. ఆ శ్రమని సమానంగా పంచుకోవటంలో ఏ సందేహమూ లేదు. చాలా ధర్మబద్ధంగా వ్యవహరించాం.

ఇక 'మందుగుండు'కి కావల్సిన మూడురూపాయలూ తెచ్చింది నేనేగదా! అందువల్ల తయారైన సిసింద్రీల్లోనూ మతాబుల్లోనూ చిచ్చుబుడ్లల్లోనూ నాకు ప్రత్యేకంగా ఎక్స్ట్రా వాటా ఇవ్వాలని అడగటంలో ఏ తప్పూ లేదుకదా? వాళ్ళు కుదరదన్నారు. అంతేగాక భయపెట్టారు. నేను డబ్బు తెచ్చాను అంటే, పెట్టుబడి పెట్టిన విషయం మా అమ్మతో చెబుతామని. ఇది నేను ఊహించలేదు. మూడురూపాయలు ఇచ్చానని తెలిస్తే మా అమ్మ నా మాడు పగలగొట్టటమేకాక మూడురోజులో ముప్పైరోజులో అన్నం నీళ్ళూ కూడా బంద్ చేస్తుంది.

'తన శాంతమె తనకు రక్ష' అన్న పదాన్ని మనసులోనే వల్లించుకుని "సరేరా.! మీరు నాకు అన్యాయం చేస్తున్నారని మీకు తెలుసు. ఆ పరాత్పరుడు పైనించి అన్నీ చూస్తూనే ఉంటాడు. మీ ఇష్టం వచ్చినట్టే పంచండి!" అని శాంతంగా అన్నాను. వాళ్ళు మహదానందంగా పంచి ఎవరి వాటా వాళ్ళు తీసుకుపోయారు.

కానీ ఈ సీత అంతరంగంలో ఎన్ని అగ్నిజ్వాలలు భుగభుగమంటున్నాయో వాళ్ళకేం తెలుసూ? ఏమైనా సరే క్రామేడ్ సీత ఎవరికీ లొంగదు. తలవంచదు.. ఎన్నటికీ ఇలా మోసపోదు. ఆలోచించా.

పండగరోజున గానీ మందుగుండు సామ్రాగ్రిని బయటపెట్టలేం. పండగరోజునయితే, "అమ్మా.. జోగారావు వాళ్ళ నాన్నగారు వంద చిచ్చుబుడ్లు చేశారట. మనకో ఇరవై ఇచ్చాడే జోగ్గాడు... అలాగే మధువాళ్ళ నాన్న ఇచ్చిన మతాబాలు ఎంత షోగ్గా ఉన్నయ్యో చూశావా!" అంటూ అమాయకంగా మొహం పెట్టి సామ్రాగ్రిని బయట పెట్టొచ్చు.

వాళ్ళూ మిగతా వాళ్ళ నాన్నల పేర్లు చెప్పి, మేం చేసుకున్న టపాకాయల్ని ఎవరిపేరు మీదో బయటికి తీస్తారు.

వాళ్ళు ఎక్కడ దాస్తారో కనిపెట్టడం కష్టంకాదు. రెండు మూడురోజులు మామూలుగానే ఉంటూ వాళ్ళ మాటల్తోనే ఆ రహస్యం బైట పెట్టించా. ఎలాగంటే -

"ఒరే మధూ.. నేను నా వాటాని కుమ్మరి నరసింహంగారి పాక వెనక వున్న ఇటికల మధ్యలో దాచారా!" అన్నాను.

"నీ ఐడియా నాకు తెల్సులేవే! నా సీక్రెట్ కనిపెట్టెయ్యాలని కదూ!" అని ఘోరంగా నవ్వి, "ఎవరితోనైనా చెబుతా.. ఎవర్నైనా నమ్ముతా.. నిన్ను మాత్రం నమ్మ!" అన్నాడు. వెలక్కాయల విషయం వాడింకా మర్చిపోలేదని నాకు తెలుసు -

"సరే! నీ యిష్టం. నిన్ను నమ్మి నేను చెప్పిన విషయం మాత్రం ఎవరికీ చెప్పకు!" అన్నాను. వాడు యీ విషయాన్ని ఖచ్చితంగా అందరితో చెబుతాడని నాకు తెలుసు.

ఇంటర్వెల్‌లో నేననుకున్నట్టుగానే వాళ్ళంతా కలిసి, "పెద్ద తెలివిగలదాన్ననుకుంటోందిరా! మా ఇంట్లో గొడ్లపాక, వెనకాల నావాటా దాచానని ఛస్తే దానికి చెబుతానా?" అని ఒకళ్ళ సీక్రెట్ ఒకళ్ళు బైట పెట్టుకున్నారు.

సాయంకాలం వాళ్ళు కబడ్డీ నిషాలో వుండగా నేను గబగబా పోయి నాకు రావాల్సిన ధర్మమైన న్యాయమైన వాటాని ఎవరూ చూడకుండా నేను తెచ్చేసుకుని నా సీక్రెట్ ప్లేసులో దాచేసుకున్నా. ఎందుకైనా మంచిదని ఓరెండు చిచ్చుబుడ్లూ మూడు మతాబులూ ఓ అయిదు సిసింద్రీలూ నామకార్థం కుమ్మరి నర్సింహులు ఇంటి వెనకున్న ఇటికల్లో పెట్టేశా గప్‌చుప్‌గా. అవెలాగూ వాళ్ళు కొట్టేస్తారని తెలుసు.

పండగరోజున వాళ్ళు 'స్టాకు'ని చూసుకుని లబోదిబో..! నేనుకూడా "దొంగలెవరో నా మతాబులూ చిచ్చుబుడ్లూ కొట్టేశా"రని ఉత్తుత్తి ఏడ్పులు ఏడ్చా.

తేలు కుట్టిన దొంగలు ఏం చేస్తారూ?

వాల్ రైటింగ్ చేశారు.

"ఒక 'బూర్జువా' దీపావళి సామాను కొట్టేసింది. దానికి పుట్టగతులుండవు!"

"ఒక ప్రమాదకరమైన వ్యక్తి పాకబడి బేచ్‌ని మోసగించింది.. దాని భరతం పట్టక మానము.."

"యీ పండగకి తప్పించుకోవచ్చు.. వచ్చే పండగకి చేతులు కాలిపోతై.. ఇది నా హృదయపూర్వక శాపం."

ఇలా ఆకాశరామన్న పేరుమీద మావాళ్ళు ప్రతాపాన్ని చూపించారు. ఎడం చేత్తో రాశారు గనక చేతి రాతని గుర్తుపట్టడానికి వీలుకాలేదు. కానీ వాళ్ళని బైటపెట్టకపోతే యీ సీతకి నిద్రెలా పడుతుందీ?

గంభీరంగా స్కూలుకెళ్ళాను. మూడురోజుల్లో స్లిప్ టెస్టు వస్తుంది అదే నా ఆయుధం.

మావాళ్ళు చదువులో 'వీక్'గదా! నా పేపర్లు కాపీ కొట్టక పోతే వీపులకి తిప్పలు తప్పవు. దాంతో ఏమీ ఎరగనట్టు "సీతా! నువ్వే మా అందర్లోకీ గ్రేటువే!" అంటూ భజన మొదలెట్టారు.

"సరేరా.! నేను చెప్పినట్టు చేస్తే ఖచ్చితంగా ఎలాగోలా మీకు జవాబుల్ని అందిస్తా!" అన్నాను.

"ఏం చెయ్యాలో చెప్పు. వెంఠనే చేస్తాం!" అన్నారు. సంయుక్తంగా. వాళ్ళు చేసిన వాల్ రైటింగ్స్‌ని యధాతధంగా నా చిత్తు పుస్తకంలో రాసిపెట్టుకున్నానని వాళ్ళకి తెలిసి ఏడిస్తేగా!

"సరేరా... మీరు చిత్తుబుక్కు తీసి నేను చెప్పింది ఎడం చేత్తో వ్రాయండి.! "సీరియస్‌గా అన్నాను. "ఎందుకూ?" అడిగాడు మద్ది మత్తెన సుభాష్ బోసు.

"ప్రశ్నలు అడక్కూడదు... చెప్పింది చేస్తామని మాటిచ్చారు. చెయ్యండి!"

"ఏం రాయాలి?" జోగ్గాడు అన్నాడు.

"నేను చెప్పింది చెప్పినట్లు రాయాలి.. ఒకదానికింద ఒకటి.. నంబర్ వన్. దీపావళి సామాను.. టూ... కొట్టేసింది.. త్రీ.. ప్రమాదకరమైన ఫోర్.. మోసగించింది.. ఫైవ్... పాకబడి.. సిక్స్... బూర్జువా... సెవెన్.. పండగకి తప్పించుకోవచ్చు... ఎయిట్... చేతులు కాలిపోతై... నైన్...హృదయపూర్వక... టెన్....శాపం!"

రాశారు. దొంగ ఎవడో తేలిపోయింది. మధూగాడు.

"ఒరే.. యీ క్షణం నించీ నీకూ నాకూ కచ్చి.. అంతేగాదు.. నన్ను నిందించావు గనక, మన అడవి ఆంజనేయస్వామి సాక్షిగా., శివాలయం యోగి లింగేశ్వరస్వామి సాక్షిగా; ఆ ముక్కోటి దేవతల సాక్షిగా నువ్వు మాష్టర్ల చేతుల్లో పడరాని పాట్లు పడతావని శపిస్తున్నా. అంతేగాదు ఇకనించీ నువ్వే నా నంబర్ వన్ శతృవ్వి.. ఇప్పటిదాకా నా మంచితనం చూశావు.. యీ క్షణం నించీ నా ప్రతాపం ఏమిటో చూస్తావు.. ఖబడ్దార్!" అని ఓ భీకర ప్రతిజ్ఞ చేశా. (చివరి డైలాగు కాంతారావు రాజనాలతో 'ఫలానా' సినిమాలో అన్నదని వేరే చెప్పక్కర్లేదుగా!)

"నేనొక్కడ్నే కాదే సీతా.. జోగారావుగాడూ మద్దిమత్తెనగాడూ, పార్వతీశంగాడూ కూడా తలో ముక్కా రాశారే!" ఏడుపు మొహం పెట్టుకుని అన్నాడు మధూగాడు.

"అయితే వాళ్ళూ టీచర్ల చేతుల్లో అష్టకష్టాలూ పడతారు. సరస్వత్తోడుగా నా మాట జరిగితీరుతుంది!" అని మిగతా వాళ్ళకీ నా శాపాన్ని సరిసమానంగా పంచి ఇంటికి చెక్కేశాను.

ఆ మరుసటి రోజున వాళ్ళు మళ్ళీ నన్ను చిన్న చిన్న 'లంచాలు' ఇచ్చి ప్రసన్నం చేసుకున్నాక నా ప్రతిజ్ఞని వెనక్కి తీసుకున్నాననుకోండి! అయినా తన కోపమె తన శతృవుకదా!

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments